3 రోజుల పాటు రంగంపేట రైల్వేగేట్ మూసివేత

రామారెడ్డి, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాకేంద్రానికి 8 కిలో మీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండలం రంగంపేట రైల్వేగేట్‌ను మూడు రోజుల పాటు మూసివేస్తున్నట్లు ఉప్పలవాయి రైల్వే స్టేషన్‌మాస్టర్ విశ్వనాథం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 4, 5, 6వ తేది వరకు రైల్వే గేట్ నుంచి రాకపోకలు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో రాకపోకలు సాగించి సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.





కొందరికే భరోసా!



- రైతు, ఆత్మీయభరోసాల కోసం ఎదురుచూస్తున్న రైతులు, కూలీలు
- జిల్లాలో రైతుభరోసాకు అర్హులు 3.25లక్షల మంది రైతులు
- 60వేల కుటుంబాలకు పైగా ఆత్మీయభరోసా
- ఇప్పటివరకు 5శాతం మందికే భరోసా నిధులు
- మండలానికో గ్రామం ఎంపిక చేసిన వారికే సొమ్ము జమ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- మిగితా వారికి ఎప్పుడనే దానిపై స్పష్టత కరువు
- సాగు లెక్కలపై కొనసాగుతున్న కసరత్తు



కామారెడ్డి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల పథకాల లబ్ధి ఎంపిక చేసిన గ్రామాల వారికే అందజేశారు. రైతుభరోసా కింద రైతులకు అందిస్తున్న పెట్టుబడి సాయం కొందరికే అందింది. మండలానికి ఒక గ్రామం చొప్పున ఎంపికచేసిన ఆ గ్రామంలోని రైతులకే ప్రభుత్వం రైతుభరోసా, ఆత్మీయభరోసా కింద ఆర్థిక సహాయాన్ని అందజేసింది. ఇక సాయం అందాల్సిన వారు పెద్దసంఖ్యలో ఉండడంతో మా వంతు ఎప్పుడు వస్తుందా అని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ నాలుగు పథకాలను అమలులోకి తీసుకువచ్చి పక్షం రోజులు గడుస్తున్నా నగదు జమ కాకపోవడంతో రైతులు, రైతు కూలీలకు నిరీక్షణ తప్పడం లేదు. అయితే ఈ పథకం కింద అర్హులైన రైతులందరికీ ఎప్పటినుంచి ప్రభుత్వం సాయం అందుతుందనే దానిపై స్పష్టత కరువైంది.

ఎంపిక చేసిన గ్రామాలకే సొమ్ము జమ

రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26 నుంచి నాలుగు పథకాలను అమలుచేసిన విషయం తెలిసిందే. అయితే మొదటి విడత కింద ఆయా జిల్లాలో కొన్ని గ్రామాలను ఎంపికచేసి లబ్ధిదారులకు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా,ఇందిరమ్మ ఇండ్లు, కొత్తరేషన్ కార్డులను జారీ చేయనున్నారు. అయితే జిల్లాలోని 22 మండలాల పరిధిలో 22 గ్రామాలను ఎంపిక చేశారు. చిన్న నాగారాం, ర్యాగట్లపల్లి, శివారు రాంరెడ్డిపల్లి, గుండెకల్లురు, రైతునగర్, సీతారాంపల్లి, బ్రహ్మణపల్లి, బంగ్రాపల్లి, గుడెం, ఎల్లారం,రాజ్‌ఖాన్‌పేట,రాచూరు,అచ్చయిపల్లి, రాములగుట్ట తండా, సుల్తాన్‌నగర్, చిన్న తక్కడ్‌పల్లి, హసన్‌పూర్, నడిమితండా, ఖానాపూర్‌తండా, వజ్జపల్లి, కొండూరు, సంతాయిపేట, మల్లాయిపల్లి గ్రామాలలోని లబ్ధిదారులకు మాత్రమే పథకాలను అమలుచేశారు. మిగితా గ్రామాల పరిస్థితి ఏమిటని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు.

13వేల ఎకరాలకే అందిన పెట్టుబడి సాయం

గత వారంరోజుల కిందట రాష్ట్రప్రభుత్వం రైతుభరోసా పథకాన్ని ప్రారంభించింది. ఈ పెట్టుబడి సాయం నిధులను ప్రభుత్వం విడుతల వారిగా అందజేస్తుందని చెప్పినప్పటికి వారం రోజులు అవుతున్న రైతులఖాతాలో పెట్టుబడిసాయం అందడం లేదు. మొదటి విడుత కింద జిల్లాలో ఎంపిక చేసిన 22 గ్రామాల పరిధిలో 13,917 ఎకరాలకు రూ.8.35 కోట్ల పెట్టుబడిసాయం నిధులను ఆయా రైతుల ఖాతాలో జమచేసింది. అయితే మిగితా రైతులు పెట్టుబడిసాయం నిధులు ఎప్పుడు జమ అవుతాయని ఆశగా ఎదురుచూస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 535 గ్రామాల్లో రైతుభరోసాకు సాగులో ఉండే భూములు 5,20,618 ఎకరాలుగా అధికారులు గుర్తించారు. ఇందులో 3,25,469 మంది రైతులు రైతుభరోసాకు అర్హులు. అయితే వ్యవసాయశాఖ చేపట్టిన సర్వేలో 7500 ఎకరాలు సాగుకు యోగ్యంకాని భూములుగా గుర్తించారు. రైతు భరోసా కింద ఎంపికచేసిన గ్రామాల రైతులకే భరోసా నిధులు పడటంతో ఇంకా పెద్దసంఖ్యలో రైతులు పెట్టుబడిసాయం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం సకాలంలో వ్యవసాయానికి ఆర్థికసహాయాన్ని అందించాలని కోరుతున్నారు. రైతుభరోసా పథకంకింద ఈసారి ప్రభుత్వం ఒక్కో ఎకరానికి రూ.6వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని అందిస్తుంది.

సాగు లెక్కలపై సాగుతునే ఉన్న కసరత్తు

ఈసారి రైతుభరోసా కింద సాయం అందించేందుకు కేవలం వ్యవసాయ యోగ్యమైన భూములకు మాత్రమే పెట్టుబడిసాయాన్ని అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రియల్‌ఎస్టేట్ వెంచర్‌లు, పెట్రోల్ బంక్‌లు, పౌల్ట్రీఫారాలు, నాలాకన్వర్షన్, గుట్టలు తదితర భూములను గుర్తించి ఈ పథకం లబ్ధిదారుల జాబితా నుంచి తొలగిస్తుంది. అయితే అర్హులైన రైతులందరికీ సాయం అందించేందుకు లబ్ధిదారుల తొలగింపు ప్రక్రియ పూర్తికాకపోవడమే అడ్డంకిగా మారిందని తెలుస్తోంది. వ్యవసాయ యోగ్యంకాని భూములను గుర్తించి ఫ్రీజ్ చేస్తేనే మిగితా వారికి ఇచ్చేందుకు అనుకులమవుతుందని ప్రభుత్వం భావిస్తుంది. ఒకే సర్వే నంబర్‌లలో ఉన్న వ్యవసాయభూములు, వ్యవసాయయోగ్యంకాని భూములను ఫ్రీజ్‌చేసే విషయంలో పీఠముడి నెలకొంది. ఈ కసరత్తు ఇంకా కొనసాగుతుండడంతో మరింత సమయం పట్టె అవకాశం ఉంది. దీనికి తోడు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో రైతుభరోసా, ఇతర పథకాల అమలు మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

273 మందికే ఆత్మీయ భరోసా

రైతుభరోసా పథకంతో పాటు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద సాయాన్ని (తరువాయి 8వ పేజీలో..)



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పోచారం, ఆగ్రో చైర్మన్ బాల్‌రాజు

వైభవంగా వసంత పంచమి వేడుకలు

- బాన్సువాడలోని శ్రీజ్ఞాన సరస్వతి ఆలయంలో బారులు తీరిన భక్తులు
- ప్రత్యేక పూజలు చేసిన ప్రభుత్వ సలహాదారులు పోచారం, ఆగ్రో చైర్మన్ కాసుల

బాన్సువాడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని బాన్సువాడ పట్టణంలోని శ్రీజ్ఞాన సరస్వతి ఆలయంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు వస్త్రాలంకరణ మంగళహారతి మంత్రపుష్పం, ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. ఉదయం నుంచి ఆలయానికి భక్తులు భారీసంఖ్యలో బారులు తీరారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు ప్రత్యేక క్యూలో దర్శనం చేసుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అమ్మవారికి తొట్టెలో వేసి జనన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజ్ ఆలయ అధ్యక్షుడు శంభోరెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఊరేగింపు నిర్వహించి భక్తులకు దర్శనం ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మహిళా సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న పోచారం

బీర్కూర్: మండలంలోని తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో కొలువు దీరిన కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని సోమవారం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ దర్శించుకున్నారు. స్వామివారికి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు బీర్కూర్ మండల కేంద్రంలోని శ్రీకోదండ రామాలయానికి చేరుకుని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ప్రదాత సూర్య భగవానుడు

- ప్రత్యక్ష దైవం సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు
- సూర్య నమస్కారాలతో ఆరాధన
- నేడు రథసప్తమి

7

మద్నూర్‌లో సాగుకు యోగ్యతలేని 510 ఎకరాల భూమి గుర్తింపు

..... వివరాలు 7లో



ఎమ్మెల్సీ ఎన్నికల అధికారి, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న సిలివేరి శ్రీకాంత్

ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్లు షురూ

- తొలిరోజు పట్టభద్రుల స్థానానికి ఆరు నామినేషన్లు
- ఉపాధ్యాయ స్థానానికి మూడు నామినేషన్లు

.... వివరాలు 7లో

రాజరాజేశ్వర ఆలయ అభివృద్ధికి కృషి

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



ఆలయం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

గాంధారి, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): గాంధారి మండలంలోని బూర్గుల్ గ్రామంలోగల శ్రీ రాజరాజేశ్వర ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అన్నారు. శ్రీ రాజరాజేశ్వర ఆలయ వార్షికోత్సవానికి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై గ్రామంలోని ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని, ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

రామారెడ్డి: జిల్లాకేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీలో గల మైసమ్మ ఆలయంలో మైసమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆలయంలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నిమ్మ భీమ్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, పోసానిపేట్ మాజీ సర్పంచ్ గీరెడ్డి మహేందర్ రెడ్డి, నాయకులు గీరెడ్డి శివారెడ్డి, మైసమ్మ ఆలయ ధర్మకర్త శ్రీనివాస్ గుప్తా, చుక్కాపూర్ లక్ష్మి నరసింహ స్వామి ఆలయం చైర్మన్ కమలాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కామారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా రాజేందర్ బాధ్యతల స్వీకరణ



కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా రాజేందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో వరంగల్ కార్పొరేషన్‌లో అదనపు కమిషనర్‌గా పని చేసి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఉదయం బాధ్యతలు స్వీకరించి కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని పేర్కొన్నారు. ఆయా వార్డుల్లో ఏమైనా సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా కార్యాలయంలో అందించాలని ఈ సందర్భంగా సూచించారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా
నీలం చిన్నరాజులు నియామకం

- 24 ఏళ్లలో గ్రామస్థాయి నుంచి జిల్లా అధ్యక్షుడి వరకు
- కష్టపడి పనిచేసిన వారిని పార్టీ గుర్తిస్తుంది: నీలం చిన్నరాజులు




కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నీలం చిన్నరాజులు నియామితులయ్యారు. కామారెడ్డి నియోజకవర్గంలోని కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లికి చెందిన నీలం చిన్నరాజులు 2001 నుంచి బీజేపీలో సామాన్య కార్యకర్తగా చేరి 24 ఏళ్ల తర్వాత జిల్లా అధ్యక్షుడిగా నియామకం కావడంతో నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలు, నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 2012, 2018లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేసి, 2021లో రాష్ట్రకార్యవర్గ సభ్యుడిగా పనిచేశాడు. 2018లో స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్, 2021లో డీఆర్‌యూసీసీ మెంబర్‌గా నామినేటేడ్ పదవి బాధ్యతలు చేపట్టారు.

ఆర్‌ఎస్‌ఎస్ నుంచి ప్రస్థానం మొదలు

కామారెడ్డి నియోజకవర్గంలో బీజేపీకి చెందిన ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఉండడంతో పాటు జిల్లా అధ్యక్ష పదవి సైతం నియోజకవర్గానికి చెందిన వ్యక్తికే అందడంతో కార్యకర్తలు, నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి కామారెడ్డి జిల్లాగా ఏర్పడినప్పటి నుంచి ఎల్లారెడ్డి నియోజకవర్గానికి చెందిన బాణాల లక్ష్మారెడ్డి ఉండగా, ఆ తర్వాత జుక్కల్ మాజీ ఎమ్మెల్యే అరుణతార జిల్లా అధ్యక్షురాలిగా పదవి బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం కామారెడ్డి నియోజకవర్గానికి చెందిన నీలం చిన్న రాజులుకు అధ్యక్షపదవి దక్కింది. నీలం చిన్నరాజులు 1984లో ఆర్‌ఎస్‌ఎస్ నుంచి మొదలుకొని 1986-1993 వరకు ఏబీవీపీలో పనిచేసి ఆతర్వాత 2001లో బీజేపీ కార్యకర్తగా చేరాడు. మున్నూరుకాపు సామాజిక వర్గానికి చెందిన కావడంతో ఆ సామాజిక వర్గంలోని వారు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం న్యాయవాదితో పాటు బిజినెస్ రంగంలో చిన్నరాజులు రాణిస్తున్నారు.

పనిచేసిన వారిని పార్టీ గుర్తిస్తుంది..

బీజేపీలో కష్టపడి పనిచేసిన వారికి మంచి గుర్తింపు నిస్తుందని (తరువాయి 8వ పేజీలో..)



బ్రహ్మణపల్లి బస్‌స్టేషన్ వద్ద నిలిచిన వాహనాలు

ఎన్‌హెచ్‌ఏఐ బస్టాపులు
పేరుకే!

- స్టాపుల వద్ద ఆగని బస్సులు
- బస్టాండ్‌లో లారీల పార్కింగ్
- చోద్యం చూస్తున్న ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు
- దాబాల యజమానులతో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు ముడుపులు?
- ఇదీ 161 జాతీయ రహదారి నిర్వహణాధికారుల తీరు



కామారెడ్డి జిల్లా సరిహద్దు నుంచి మొదలైన ఎన్‌హెచ్‌ఏఐ రహదారి ఇదే..

నిజాంసాగర్, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): కోట్లాది రూపాయలు వెచ్చించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టింది. జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా రోడ్డు వెంటే ఉన్న గ్రామాల బస్సు స్టేషనులను నిర్మించారు. ఈ బస్ స్టేషన్లు గ్రామాల వారధి కూడాల్లో నిర్మించకుండా గ్రామాలకు వెళ్లే రహదారులకు దాదాపు వెయ్యి అడుగుల దూరాన నిర్మాణం చేపట్టారు. ఈ బస్‌స్టేషన్‌లో ఆర్టీసీ బస్సులు ఆపకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పేరుకే ఎన్‌హెచ్‌ఏఐ బస్సు స్టాపులు ఉన్నాయి తప్ప ఏ ఒక్క బస్సూ నిలుపకపోవడం ఏమిటని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఎన్‌ఎపి రహదారిని 2018లో నిర్మాణం పనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. దాదాపు 120 కిలోమీటర్ల దూరాన మూడు ప్యాకేజీలతో 161 రహదారి నిర్మాణ పనులు పూర్తి చేసి 2021లో ఈ రహదారిని జాతికి అంకితం చేశారు. ఏ రహదారి వెంట మూడు ప్యాకేజీలుగా పనులు పనులు చేపట్టిన అధికార యంత్రాంగం ఎన్‌హెచ్‌ఏఐ అధికార యంత్రాంగం రహదారి వెంట గ్రామాలకు వెళ్లే రహదారికి ఎన్‌హెచ్‌ఏఐ అధికార యంత్రాంగం బస్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టింది. ప్రయాణికుల అవసరాలకు మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం సైతం చేపట్టింది. కానీ 161 హరహదారిపై వెళ్లే ఆర్టీసీ బస్సులు సంగారెడ్డి కామారెడ్డి జిల్లాల్లో ఉన్న రహదారి వెంట చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణం అస్తవ్యస్తంగా ఉంది. దీనిపై ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు కనీసం పట్టించుకునే పాపాన పోలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్‌హెచ్‌ఏఐ వెంట ఉన్న సర్వీస్ రోడ్లలో తరచూ భారీ వాహనాలు, దాబాలకు అనుగుణంగా నిలిపివేయడంతో రోడ్డు గుండా వెళ్లే వాహనదారులు, బస్సు కోసం వేచి ఉన్నా ప్రయాణికులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంగారెడ్డి జిల్లా అల్లాదుర్గం శంకరంపేట నిజాంపేట ఖలేర్ కామారెడ్డి జిల్లా సరిహద్దుల్లోని నిజాంసాగర్ మండలం బ్రాహ్మణపల్లి ఆరేపల్లి నర్సింగరావు పల్లి గ్రామాలకు రహదారులను అనుసంధానం చేస్తూ బస్‌స్టేషన్లను నిర్మాణం చేపట్టారు. కానీ రహదారుల శాఖ ఆర్టీసీ అధికార యంత్రాంగం ఈ బస్‌స్టేషన్‌ల వద్ద బస్సులు (తరువాయి 8వ పేజీలో..)

పిల్లలకు మెనూ ప్రకారం భోజనం అందించాలి


సరుకులను చూస్తున్న ఎంపీవో

వేల్పూర్ ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం సూచించిన మేరకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంపీవో సాయిలు సూచించారు. సోమవారం మండలంలోని కుకునూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం, అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందించే భోజనం తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీవో మాట్లాడుతూ పౌష్టికాహారాన్ని పిల్లలకు ప్రతీరోజు అందించాలని సూచించారు.

ఈరవత్రి అనిల్‌ను కలిసిన గల్ఫ్ వలస కార్మికులు


ఈరవత్రి అనిల్‌తో తెలంగాణ గల్ఫ్ వలస కార్మికులు

ఏర్గట్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): దుబాయ్ పర్యటనలో ఉన్న తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ ఈరవత్రి అనిల్‌ను సోమవారం తెలంగాణ గల్ఫ్ వలస కార్మికులు బాల్కొండ నియోజకవర్గానికి చెందిన తిమ్మాపూర్ రఘు, తాళ్ళరాంపూర్ గ్రామానికి చెందిన ఆడెం ప్రతాప్, మెండోర సతీష్, కాసర్ల సురేష్‌లు ఆయన్ని కలిశారు. ఈ సందర్భంగా దుబాయ్‌లో తెలంగాణ గల్ఫ్‌కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అనిల్‌కు వివరించారు. అలాగే గల్ఫ్ కార్మికుల కోసం తీసుకొచ్చిన జీవో నెంబర్ 21 ద్వారా గల్ఫ్‌లో మరణించిన కార్మికులకు ఐదులక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించినందుకు గాను సీఎం రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ చెల్లించాలి

ముప్కాల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కులగణన 2024 నిర్వహించిన ఉపాధ్యాయులకు రావాల్సిన రెమ్యూనరేషన్ వెంటనే ఉపాధ్యాయులకు చెల్లించాలని టీఎస్‌యుటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఓ.రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా సర్వేచేసిన ఉపాధ్యాయులకు సీసీఎల్‌ను మంజూరు చేయాలని కోరారు.

వరదకెనాల్‌లో ప్రమాదవశాత్తు పడి కూలి మృతి

వేల్పూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచంపల్లి గ్రామశివారులోని వరదకెనాల్‌లో వలస కూలి ప్రమాదవశాత్తు పడి మృతిచెందాడు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ గ్రామానికి చెందిన రాజు (40) గత కొన్నేళ్ల నుంచి మండలంలోని అంక్సాపూర్ గ్రామంలో వ్యవసాయ కూలీగా పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. సోమవారం ఉదయం బహిర్భుమికి వెళ్ళిన రాజు ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. వరదకెనాల్‌లో నీటిపై తేలిన మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో జాలర్ల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాన్ని ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు.

పడిగెల శివారులో పేకాట రాయుళ్ళ అరెస్టు

వేల్పూర్ ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడిగెల గ్రామశివారులో ఆదివారం రాత్రి పేకాట స్థావరంపై నిజామాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేసి 14 మంది పేకా టరాయుళ్ళను అరెస్టు చేసినట్లు వేల్పూర్ ఎస్సై సంజీవ్ తెలిపారు. పడిగెల గ్రామశివారులో పేకాట ఆడుతున్న పక్కా సమాచారం మేరకు నిజామాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి 14 మంది పేకాట రాయుళ్ళను అరెస్టు చేసి వారి నుంచి రూ.35 వేల 450 నగదుతో పాటు 13 సెల్‌ఫోన్‌లు, 12 మోటర్‌సైకిళ్ళను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉరివేసుకొని ఇటుక బట్టి కూలీ మృతి

నందిపేట, ఫిబ్రవరి 03 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వన్నెల్(కే) గ్రామంలో చెట్టుకు ఉరివేసుకొని ఇండ్ల కృష్ణ(32) అనే కూలీ మృతిచెందినట్లు ఎస్‌ఐ ఎం.చిరంజీవి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా జొన్నాడ గ్రామానికి చెందిన ఇండ్ల కృష్ణ (32) రెండు సంవత్సరాల క్రితం నందిపేట మండలంలోని వన్నెల్ (కే) గ్రామంలోని గౌసొద్దిన్‌కు చెందిన ఇటుక బట్టీలో పనిచేయడానికి కుటుంబసభ్యులు, బంధువులతో కలిసి వలస వచ్చాడు. కొన్నిరోజులుగా తాగుడుకు బానిసై జీవితంపై విరక్తి చెంది ఇటుక బట్టీ ఆవరణలో ఉన్న చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని అన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసై మరొకరు..

రుద్రూర్ : మండలంలోని అంబం(ఆర్) గ్రామంలో పిట్ల శ్రీనివాస్ మద్యానికి బానిసై సోమవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. రుద్రూర్ ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం.. పిట్ల శ్రీనివాస్ మేస్త్రీ పనిచేస్తుండేవాడని ఆరునెలల కిత్రం శ్రీనివాస్‌కు కాలు విరగడంతో అప్పటి నుంచి మద్యానికి బానిసై ఏ పనిచేయకుండా ఇంట్లోనే ఉండేవాడని, తరచు ఇంట్లో గొడవ పడేవాడన్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య పట్ల గంగాలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

● తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ సుదర్శన్ రెడ్డి

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మహిళా సంఘాలకు బ్యాంక్ ద్వారా అందించిన రుణాలను సకాలంలో చెల్లించాలని కోనాసమందర్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ సుదర్శన్ రెడ్డి అన్నారు, సోమవారం మండలంలోని కోనాసమందర్‌లో బ్యాక్ రికవరీ కమిటీ సమావేశంలో కమ్మర్‌పల్లి ఏపీఎం కుంట గంగారెడ్డితో కలిసి పాల్గొన్నారు. తమ బ్యాంక్ పరిధిలో నర్సాపూర్, కోనాసమందర్, ఇనాయత్‌నగర్ గ్రామాలకు చెందిన మహిళాసంఘాలు రుణాలు పొందారని పేర్కొన్నారు. . సమావేశంలో కోనాసమందర్ క్లస్టర్ సిసి వర్షం శ్రీనివాస్, గ్రామ సమాఖ్య పాలకవర్గ సభ్యులు మౌనిక మేఘన, సమిత, వీవోఏలు నయన లత పాల్గొన్నారు.

గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

ఎడపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పులి చెరువుకట్టపై ఎడపల్లి గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన గంగమ్మ దేవి ఆలయంలో సోమవారం గంగాదేవి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్ఛరణలతో గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు దుబ్బాక గంగాధర్, కార్యదర్శి ఊరడి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు సుమన్, సందీప్, కోశాధికారి దుబ్బాక సాయిలు, రాజయ్య, సభ్యులు పాల్గొన్నారు.

శివాలయం నిర్మాణానికి భూమిపూజ

ఎడపల్లి, ఫిబ్రవరి03(ఆంధ్రజ్యోతి) : మండలంలో గల జానకంపేట గ్రామంలోని అశోక్‌సాగర్ వద్ద నూతన శివాలయం నిర్మాణానికి సోమవారం వేదపండితుల మంత్రోచ్చారణలతో భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామ పెద్దలు, గ్రామస్థులు, దాతల సహకారంతో స్వయంభుగా వెలసిన శివుడికి ఆలయ నిర్మాణం చేపడుతున్నామని, త్వరిత గతిన పూర్తి చేస్తామన్నారు.

గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలి

● ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి
● విజేతలకు బహుమతులు అందజేసిన మున్సిపల్ కమిషనర్


క్రీడాకారులకు పరిచయం చేసుకుంటున్న ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించి ఓడిన వారు పట్టుదలతో విజయసాధనకు కృషిచేయాలని ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆర్మూర్ పట్టణంలోని మినీస్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర సీనియర్ మహిళల సాఫ్ట్‌బాల్ పోటీల ఫైనల్ మ్యాచ్‌ప్రారంభానికి ముందు ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో సత్తా చాటి జాతీయస్థాయికి ఎదగాలన్నారు. ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ కమిషనర్ రాజు విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో పాల్గొనాలని అన్నారు. మహిళలు అన్ని క్రీడల్లో పాల్గొని తమ ప్రతిభను చూపి రాణించాలన్నారు. ఈ పోటీల్లో ప్రథమస్థానంలో నిజామాబాద్ నిలువగా సిద్దిపేట ద్వితీయ, హైదరాబాద్ తృతీయ స్థానంలో నిలిచాయి. కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి శోభన్‌బాబు, రాష్ట్ర ఒలంపిక్ పరిశీలకులు లింగన్న, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగామోహన్, మల్లేష్‌గౌడ్, వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయి

● బోధన్ ఏసీపీ శ్రీనివాస్


గెలుపొందిన వారిని అభినందిస్తున్న ఏసీపీ

బోధన్‌రూరల్,ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): క్రీడలు శారీరక దారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. పోలీసులకు తెలంగాణ పోలీస్ ఆధ్వర్యంలో క్రీడ పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. స్విమ్మింగ్, రన్నింగ్, టెబుల్ టెన్నిస్ తదితర క్రీడ పోటీలలో గెలుపొందిన పోలీసులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు నిత్యం వ్యాయమం చేయాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి వ్యాయమం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని చింతలూర్ గ్రామస్థుల వినతి

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతలూర్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని వీడీసీసభ్యులు, గ్రామస్థులు విన్నవించారు. నిజామాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో డాక్టర్ భూపతిరెడ్డిని చింతలూర్ గ్రామస్థులు కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. గ్రామంలోని గుట్టపైకి వరకు సీసీరోడ్డుకు నిధులు మంజూరు చేయాలని, నిజామాబాద్ నుంచి చింతలూర్ మీదుగా భీమ్‌గల్ వరకు బస్సు సౌకర్యం కల్పించాలని, రామడుగు ప్రాజెక్టు ద్వారా గ్రామంలోని చెరువులకు యాసంగి పంటలకు సాగునీటిని అదనంగా నీటిని అందించాలని ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. దీంతో ఎమ్మెల్యే అధికారులకు ఫోన్‌ద్వారా మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డికి చింతలూర్ వీడీసీసభ్యులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కొలిప్యాక్ సింగిల్‌విండో ఛైర్మన్ నాగుల శ్రీనివాస్, వీడీసీసభ్యులు తిరుపతిరెడ్డి, ప్రసాద్, రవి, నర్సయ్య, శంకర్, ముత్తెన్న, మహేష్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు గంగాధర్, మాజీఉపసర్పంచ్ జలందర్, కాంగ్రెస్ నాయకులు చిన్నారెడ్డి, గడ్డం శ్రీనివాస్, లింబాద్రి పాల్గొన్నారు.



నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యేతో చింతలూర్ గ్రామస్థులు

పట్టణ వాసులు పన్నులు చెల్లించాలి

● బోధన్ మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ

బోధన్‌రూరల్,ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణవాసులు, వాణిజ్య, దుకాణ సముదాయదారులు సకాలంలో మున్సిపాలిటీకి చెల్లించాల్సిన పన్నులు చెల్లించి బోధన్ పట్టణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని బోధన్ మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ అన్నారు. సోమవారం పన్నుల వసూళ్ల కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. బృందాలుగా ఏర్పడ్డ మున్సిపల్ సిబ్బంది పన్నుల వసూళ్ల కోసం ఇంటింటికి వెళ్లి పన్నులు వసూలు చేశారు. బోధన్ మున్సిపల్ అడిషనల్ కలెక్టర్ అంకిత్ ఆదేశాల మేరకు పన్నుల వసూళ్లలలో వేగం పెంచాలని ఆయన సూచించారు. ఈ నెలాఖరుకల్లా వందశాతం పన్నులు వసూలు అయ్యేలా చూడాలన్నారు. దుకాణ యాజమానులు, బడాబాబులు తమ ఇంటి పన్నులు సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలన్నారు. లేని యెడల మున్సిపల్ నియమనిబంధనలను అమలు చేయాల్సి వస్తుందన్నారు. పలు చోట్ల మున్సిపల్ కమిషనర్ స్వయంగా ఇంటింటికి వెళ్లి పన్నుల వసూలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులున్నారు.


పట్టణంలో పన్నులను వసూలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఘనంగా వసంత పంచమి


భీమ్‌గల్ సరస్వతి విద్యామందిర్‌లో సామూహిక అక్షరాభ్యాసం


మోకన్‌పల్లి కేజీబీవీ పాఠశాలలో సరస్వతి పూజ నిర్వహిస్తున్న సిబ్బంది

భీమ్‌గల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) :పట్టణ కేంద్రంలో శ్రీ సరస్వతి విద్యామందిర్ ఉన్నత పాఠశాలలో సామూహిక అక్షరబ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భీమ్‌గల్ పట్టణ పరిసర గ్రామాల్లోని ప్రజలు తమ పిల్లలకు అక్షరభాస్యం చేయించారు. పురోహితులు రాజేంద్రప్రసాద్ బాసరలోని జ్ఞానసర స్వతి ఆలయం నుంచి పాఠశాలకు వచ్చి కుంకుమ, సరస్వతి మాత ఫొటోను తల్లిదండ్రులకు అందజేసి 120 మంది చిన్నారులకు సామూహిక అక్షర బ్యాసం చేయించి ఆశీస్సులను అందజేశారు. భీమ్‌గల్ ఎస్‌ఐ జి.మహేష్ పాల్గొన్నారు.

ముప్కాల్ : మండలంలోని చిట్టాపూర్‌లో సోమవారం శ్రీ సాయిబాబా దివ్యక్షేత్రంలో వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వసంతి పంచమిలో భాగంగా ఉదయం సరస్వతిమాతకు ప్రతిమను ప్రతిష్ఠించి పండితులు చండియాగం నిర్వహించారు. అనంతరం దంపతులతో సామూ హిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు.

జక్రాన్‌పల్లి : తేజస్ విద్యా నికేతన్ పాఠశాలలో జక్రాన్‌పల్లి, కలిగోట్, పడకల్, చింతలూర్, మనోహరాబాద్, అర్గుల్ పాఠశాలలోని వంద విద్యార్థులతో సామూహిక అక్షరభ్యాసాన్ని నిర్వహించారు. కార్యక్ర మంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం.శంకర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : బషీరాబాద్ గ్రామ శివారులో కొలువుదీరిన మాతా జగదాంబా (శుక్రవారం దేవి) ఆలయం వద్ద కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మంత్ర రాజ్యం కృష్ణమోహన్ పంతులు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజ అభిషేకం, హారతి, మంత్రపుష్పం, యజ్ఞం, జయాదిహోమం, నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్నారైలు పోలీస్ విద్యాసాగర్-లావణ్య దంపతులతోపాటు శ్రీరాముల మురళి, ,మారంపల్లి అశోక్, బైకాని మహేష్, నర్ర ముత్తన్న, ఏనుగు గంగారెడ్డి, వెన్నెల దేవేందర్, సామెర సుమన్, సదానంద్, దేవి పాల్గొన్నారు.

వేల్పూర్ : మండలంలోని పడిగెల గ్రామంలోని దేవి ఆలయంలో భక్తులు అమ్మవారికి అర్చన, అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పిల్లలకు అక్షరబ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి అంగన్‌వాడి టీచర్ వసంత చేతుల మీదుగా పిల్లలకు పలకపై అక్షరబ్యాసం చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ వసంత, ఆయ లక్ష్మీనర్సింహ పాల్గొన్నారు.

ఏర్గట్ల: శ్రీ అపూర్వ పాఠశాలలో సోమవారం చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ యశ్వంత్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్ : అమ్మవారి ఆలయంలో ఉదయం నుంచి వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య అక్షరాభ్యాసం, సహస్ర కుంకుమార్చన, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచే కాక మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నవీపేట : మండలంలోని పలు గ్రామాలలో సోమవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మోకన్‌పల్లి కస్తూర్బా బాలికల పాఠశాలలో సరస్వతి విగ్రహానికి టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందితో పాటు విద్యార్థులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారిణి కవిత, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. నవీపేటలోని మోడల్ పాఠశాలలో నూతనంగా సరస్వతి దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నందిపేట : మండలంలోని వెల్మల్ గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం వసంత పంచమి సందర్భంగా సరస్వతి విగ్రహన్ని ఆవిష్కరించారు. పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్(ఇంగ్లీష్)గా పనిచేస్తున్న శివాణి ఉపాధ్యాయురాలు కుటుంబ సభ్యులు ఏలేటి సింధూర భర్త ఏలేటి సాయిరాం రెడ్డి, కూతురు ఈషా, కుమారుడు ఆయిష్‌లు అస్ట్రేలియా దేశంలో ఉద్యోగం చేస్తారు. వారు పంపిన విరాళం మేరకు హైస్కూల్‌లో సరస్వతి మాత విగ్రహం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణ, గంగారెడ్డి, ప్రొద్దుటూరి శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

కోటగిరి : కోటగిరి ఉమ్మడి మండలంలో సోమవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వసంత పంచమి వేడుకలను పురస్కరించుకుని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పోతంగల్ మండల కేంద్రంలో సాయిబాబ ఆలయ 22 వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా కొనసాగాయి. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ప్రధాని, కేంద్రమంత్రి దిష్టిబొమ్మల దహనం

మోర్తాడ్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జాతీయరహదారిపై మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ప్రధాని నరేంద్రమోదీ, ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో మోర్తాడ్ మాజీ ఎంపీపీ శివలింగు శ్రీనివాస్, ఎఎంసీ డైరెక్టర్‌లు బూత్‌పూరం మహిపాల్, జిల్లా కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షుడు తీగెల సంతోష్‌రెడ్డి, శెట్‌పల్లి రంజిత్, అబ్దుల్ నవీద్, కాంగ్రెస్ నాయకులు గడ్డం అనిల్, ఆనంద్, దేవేందర్, అడ్వకేట్ ప్రవీన్, అంజాద్, జైడి చిన్న గం గారాం, ఒడ్యాట్ నవీన్ పాల్గొన్నారు.

భీమ్‌గల్ : అంబేద్కర్‌చౌరస్తా వద్ద ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలసీతారామన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోదిరె స్వామి, పట్టణ అధ్యక్షుడు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : జాతీయరహదారిపై మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు సుంకెట రవి, మార్కెట్ కమిటి ఛైర్మన్ పాలెపు నర్సయ్య పాల్గొన్నారు.

ముప్కాల్ : మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ప్రధాని నరేంద్రమోదీ, ఆర్థిక మంత్రి నిర్మల సీతరామన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. మండల అధ్యక్షుడు మగ్గిడి ముత్యంరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు గడ్డం చిన్నారెడ్డి, వేల్పూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చందరవి, కిసాన్‌ఖేత్ అధ్యక్షుడు బద్దం సాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏర్గట్ల : బడ్జెట్‌లో తెలంగాణపై వివక్ష చూపారని, పక్క రాష్ట్రాల్లాగే తెలంగాణకు నిధులు కేటాయించి ఇక్కడి ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, రేండ్ల రాజారెడ్డి, బద్ధం లింగారెడ్డి, ప్రసాద్, జాకీర్, ఓర్సు రాములు పాల్గొన్నారు.


కమ్మర్‌పల్లిలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కొండూర్‌లో శత చండీయాగం


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

నందిపేట : మండలంలోని చౌడమ్మ కొండూర్‌లో గ్రామాభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న శత చండీయాగం ఉత్సవాలు సోమవారం ప్రారంభమైనాయి. ఇందులో భాగంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డికి గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. చౌడేశ్వరీ ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాకేష్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటీసీ సభ్యురాలు డి రాజు, నాయకులు దేవిదాస్, సాయి, మహేందర్, రాజు తది తరులున్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ఆర్మూర్‌రూరల్ : మండల కేంద్రంలో వెయ్యి నామాల వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి సోమవారం గ్రామస్థులు భూమిపూజ చేశారు. వేదపండితుడు డాక్టర్ అరుణ్‌శర్మ ఆధ్వర్యంలో ఏడుగురు దంపతులతో యజ్ఞం నిర్వహించారు. ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి హాజరై పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందిస్తానన్నారు. ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వినయ్ రెడ్డి హాజరై పూజలు నిర్వహించారు. ఆలయంలో షెడ్డు, ప్రహరి నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీసీఈవో సాయన్న, కల్లెం బోజారెడ్డి, మాజీఎంపీటీసీ మల్లేష్, కల్లెం మోహన్‌రెడ్డి, దుమ్మజి శ్రీనివాస్, ఆలూర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సాలూర ఎంపీడీవోగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ

సాలూర, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సాలూర ఎంపీడీవోగా శ్రీనివాస్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాలూర మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తానన్నారు. గ్రామాలలో ప్రజలు పన్నులను సకాలంలో చెల్లించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ నెలాఖరుకల్లా వందశాతం పన్నులు వసూలు అయ్యేలా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట బోధన్ ఎంపీడీవో బాల గంగాధర్, ఎంపీవో మధుకర్ తదితరులున్నారు.

అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు

నవీపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ అయ్యప్పస్వామి ఆలయ 12వ వార్షికోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, గణపతి హోమం, పుణ్యావచనం, 108కలశలతో స్వామివారికి అభిషేకం, మహాహారతి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామి ఆలయంలో తహసీల్దార్ వెంకటరమణ, నాయబ్ తహసీల్దార్ తెలంగ్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కారు, బైక్ ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

నవీపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాంధీనగర్ సమీపంలో సోమవారం కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. కారు బాసర నుంచి హైదరాబాద్ వెళ్తుండగా బైక్ నందిపేట మండలం ఐలాపూర్ నుంచి నవీపేట వైపు వస్తుందని వారు పేర్కొన్నారు. కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో బైక్‌పై ఉన్న వ్యక్తితో పాటు వెనుక కూర్చున్న మహిళకు తీవ్ర గాయాలయ్యాయని బాధితులను 108లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని వారు వివరించారు. ప్రమాదం విషయంపై పోలీసులకు సమాచారం అందించినట్లు స్థానికులు తెలిపారు.

కోడి పందెలు ఆడుతున్న ఆరుగురి అరెస్టు

నవీపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాడాపూర్ శివారులో ఆదివారం రాత్రి కోడి పందెలు ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడి చేయగా ఆరుగురు వ్యక్తులను పట్టుకుని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ వినయ్ తెలిపారు. అరెస్టు అయిన వారిలో ముగ్గురు నిజామాబాద్‌లోని వినాయక్ నగర్, ఒకరు చంద్రశేఖర్ కాలనీ చెందిన వారు కాగా మండలంలోని సిరన్‌పల్లికి చెందిన ఒకరు, నిజామాబాద్ మండలంలోని తిర్మన్‌పల్లికి చెందిన మరొకరు ఉన్నారని ఎస్‌ఐ తెలిపారు. వారి వద్ద నుంచి రెండు కోడిపుంజులు, 4,650 రూపాయల నగదును సీజ్ చేశామని ఎస్‌ఐ తెలిపారు. వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న రెండు కోడిపుంజులను కోర్టులో అప్పగించడం జరిగిందని ఎస్‌ఐ వివరించారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా చందూర్ వాసి

మోస్రా,ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా బాన్సువాడ నియోజకవర్గం నుంచి చందూర్ మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకులు ఎల్లమ్మల పోశెట్టి నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర సంస్థాగత ఎన్నికల అధికారి యెండల లక్ష్మీనారాయణ ఒక ప్రకటన విడుదల చేశారని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇంత పెద్ద బాధ్యత అప్పగించినందుకు పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో మద్యం తాగి వాహనం నడిపిస్తున్న వ్యక్తిని సోమవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఒకరోజు జైలుశిక్ష విధించినట్లు బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కోటగిరి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అధిక మద్యం సేవించి ఆదివారం రాత్రి పట్టుబడడంతో సోమవారం బోధన్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఒకరోజు జైలుశిక్ష విధించారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు ప్రధాన కూడళ్లలలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడపకూడదన్నారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టాలని వినతి

బోధన్‌రూరల్, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో రోజురోజుకు దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, దోమల నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ యువ నాయకులు పెరిక రామకృష్ణ, నాగుల రవి శంకర్ గౌడ్ అన్నారు. సోమవారం బోధన్ మున్సిపల్ కార్యాలయంలో ఇన్‌చార్జి మేనేజర్ సుజాతను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియాల వల్ల ప్రజలు టైఫాయిడ్ వంటి విషజ్వరాల వల్ల ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తూ వేల రూపాయలు ఖర్చు పెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలు వార్డులలో మురుగునీరు ఖాళీ స్థలాలలో నిల్వ ఉండడం వల్ల దోమలు ఎక్కువగా వృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. పట్టణంలో ఫాగ్ మిషన్ తెప్పించి స్ప్రే చేయాలని, ప్రజల సమస్యలే ధ్యేయంగా అధికారులు పని చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు షేక్ తౌఫిక్ ఖాన్ తదితరులున్నారు.


ఇన్‌చార్జి మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఫటా..ఫట్...

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి

● రాజేశ్వర్, ఎంపీడీవో, గాంధారి



ఆంధ్రజ్యోతి : మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల సర్వే ఎంతవరకు పూర్తయింది

ఎంపీడీవో: గాంధారి మండలంలో ఇంది రమ్మ జిల్లా సర్వేను జనవరి 28 వరకు పూర్తిచేసి ఉన్నతాధికారులకు నివేదించాం

ఆంధ్రజ్యోతి : ఇందిరమ్మ ఇండ్లులేని వారిని ఎలా గుర్తించారు

ఎంపీడీవో: ప్రతీ గ్రామంలో అధికారులు సర్వే చేయడం జరిగింది. తెల్లరేషన్ కార్డులతో సంబంధం లేకుండానే పంచాయతీ కార్యదర్శిలు సర్వే చేసి ఆన్‌లైన్‌లో అభ్యర్థులపేర్లు నమోదుచేశారు. ప్రతి ఒక్క నిరుపేదలను గుర్తించడం జరిగింది.

ఆంధ్రజ్యోతి : మండలంలో పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉంటున్నారా..?

ఎంపీడీవో: ప్రతి పంచాయతీ కార్యదర్శికి అందుబాటులో ఉండి గ్రామాల్లో ఎప్పటికప్పుడు సమస్యలను ప్రత్యేక అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించాం. నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం

ఆంధ్రజ్యోతి : ప్రతీ గ్రామంలో నర్సరీలు ఏర్పాటుచేశారా

ఎంపీడీవో: దాదాపు అన్ని గ్రామాలలో మొక్కలు నాటడానికి నర్సరీలను ఏర్పాటుచేసి ప్రతీ గ్రామానికి మొక్కలు పెంచాలని పంచాయతీ కార్యదర్శులకు సంబంధిత సిబ్బందికి సూచించాం. మొక్కలను నాటారు.

ఆంధ్రజ్యోతి : అన్ని గ్రామపంచాయతీలకు పంచాయతీ కార్యదర్శులు ఉన్నారా...?

ఎంపీడీవో: గాంధారి మండలంలోని దాదాపు అన్ని గ్రామపంచాయతీలకు పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. ప్రతి కార్యదర్శికి వారి గ్రామపంచాయతీ పరిధిలోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంతో పాటు అందుబాటులో ఉండి విధులు నిర్వహిస్తున్నారు.

● (ఆంధ్రజ్యోతి, గాంధారి)

● నేడు రథసప్తమి

ఆరోగ్య ప్రదాత సూర్య భగవానుడు

భక్తి



ముస్తాబైన నీలకంఠేశ్వర ఆలయం

● ప్రత్యక్ష దైవం సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు ● సూర్య నమస్కారాలతో ఆరాధన ● అత్తా కోడళ్లకు ప్రత్యేకం ● రథంపై ఊరేగనున్న నీలకంఠేశ్వర స్వామి

నిజామాబాద్ కల్చరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ప్రధాతగా సప్త అశ్వాలతో దర్శనమిచ్చే సూర్య భగవానుడిని పూజిస్తారు. మాఘమాసం శుక్లపక్ష సప్తమి పర్వదినాన్న సూర్యుడి జన్మదినంగా జరుపుకుంటారు. ప్రతియేటా సూర్య భగవానుడు ఉత్తర దక్షిణ ఆయనాల గుండా దర్శనమిస్తాడని అందులో ఉత్తరాయనం నుంచి ప్రవేశించే పర్వదినాలలో రథ సప్తమి రావడం ప్రత్యేకతగా భావిస్తారు. ప్రత్యక్ష దైవమైన సూర్యభగవానుడిని పూజించడం వల్ల ఆయురారోగ్యాలు చేకూరుతాయని విశ్వసిస్తారు. హిందూ సంప్ర దాయంలో సూర్యభగవానుడికి ప్రత్యేకత ఉండటంతో ప్రతీరోజు సూర్యభగవానుడిని తర్పనాలతో పూజించడం ద్వారా ఆ ఇంట ధనధాన్యాలతో పాటు ఆయురారోగ్యాలు పుష్కలంగా ఉంటాయని శాస్త్రం చెబుతుంది. సాక్షాత్తు దేవదేవుడైన శ్రీమన్నారాయుడే సూర్య భగవానుడిగా భక్తులకు ప్రత్యక్షంగా దర్శమిస్తాడని పురాణాలు చెబుతున్నాయి. ఈరోజున ఉదయాన్నే సూర్యభగవానుడిని తలుచుకుంటూ ప్రత్యేక ప్రార్థనలతో స్నానం ఆచరించి పూజిస్తారు. తద్వారా ఏడాది పొడవున ఆయురారోగ్యంతో ఉంటారని భక్తులు భావిస్తారు.

సూర్య నమస్కారాలతో ఆరాధన

రథసప్తమి సూర్యభగవానుడి జయంతిగా జరుపుకుంటారు. యోగాసనాలలో సూర్య నమస్కారాలకు ప్రత్యేక స్థానం ఉంది. సూర్య నమస్కారాలతో ఈ రోజున ఆరాధన చేయడం ద్వారా యోగా ఆసనాలకు పరిపూర్ణత చేకూరుతుందని యోగా శాస్త్రం చెబుతుంది. యోగా కేంద్రాలు, పాఠశాలల్లో యోగా అధ్యాపకులు ఈ రోజును ప్రత్యేకంగా భావించి సూర్య నమస్కారాలతో సూర్యుడిని పూజిస్తారు.

అత్తా కోడళ్ల ప్రత్యేకత

అత్తా కోడళ్లకు ప్రత్యేకతగా రథసప్తమి పండుగను జరుపుకుంటారు. రథసప్తమి రోజున ఇంటి ముందట రథంతో ముగ్గులు వేసి సూర్య భగవానుడిని అత్తా కోడళ్లు ఘనంగా స్వాగతం పలుకుతారు. లక్ష్మీ నారాయణుడిని స్వరూపంగా భావించి సూర్యుడిని పూజించి ఇంటి కోడలికి అత్తా చీర సారెను అందించడం పండుగలో ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. ఈ రోజున అత్తా కోడళ్లు తమ ఇంటికి వచ్చిన ముత్తయిదువలకు వాయినాలు ఇచ్చుకొని పది కాలాల పాటు సౌభాగ్యాన్ని కోరుకుంటారు.

రథంపై ఊరేగనున్న నీలకంఠుడు

నీలకంఠేశ్వర స్వామి రథసప్తమి పర్వదినాన్న భక్తులకు విమాన రథోత్సవంపై దర్శనమివ్వనున్నారు. సంక్రాంతి పర్వదినాన్న అంగరంగ వైభవంగా కల్యాణం జరుపుకున్న నీలకంఠేశ్వరుడు ప్రతియేటా రథసప్తమి రోజున నగర పూర వీధుల గుండా రథంపై ఊరేగుతారు. ఇందూరు జిల్లాకే ప్రత్యేక జాతరగా జరుపుకునే కంఠేశ్వర్ ఆలయ శిఖర ప్రతిష్ఠ రోజునే రథం ప్రారంభమైందని ఆలయ చరిత్ర ద్వారా తెలుస్తుంది. శిఖర ప్రతిష్ఠ రోజున నీలకంఠేశ్వర స్వామి భక్తులకు దర్శనమిస్తారని భక్తులు నాటి నుండి భావిస్తారు. ఆలయ శిఖర ప్రతిష్ఠ చేసిన శిల్పి తన తల్లిని వెనకకు తిరిగి చూడకుండా వెళ్లమని చెప్పినప్పటికి తల్లిని చూడటంతో నాటి నుంచి నేటికి నీలకంఠేశ్వర రథయాత్రలో శిల్పికి అతని తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. నీలకంఠేశ్వర ఆలయం నుంచి రథో త్సవం ప్రారంభమై తల్లిగోరి వరకు చేరుకొని ప్రత్యేక పూజలు చేస్తారు. నీలకంఠేశ్వరుని జాతరకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్నాటక తో పాటు ఇతర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్త లు వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. జాతరలో నీలకంఠుడు రథంపై ఎక్కగానే భక్తులు రథానికి ఉట్టీలు కట్టి ప్రత్యేక పూజలు నిర్వహిస్తే కోరిన కోరికలు నెరవేరుతాయని విశ్వసిస్తారు.

ముస్తాబైన కంఠేశ్వర ఆలయం

జిల్లాలోని ప్రసిద్ధ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న నీలకంఠేశ్వర ఆలయ జాతరకు ఆలయం ముస్తాబైంది. విద్యుత్ రంగు దీపాలతో ఆలయ ప్రాంగణాన్ని, శిఖరాన్ని అలంకరించారు. ఉదయం నుంచే భక్తులు స్వామిని రథోత్సవాన్ని దర్శించుకోనుండడంతో అందుకు అనుగుణంగా ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆలయం నుంచి రథోత్సవం సాగే దారి పొడవున ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లను పూర్తి చేసింది. నీలకంఠేశ్వరుడి జాతరను ఉదయం 4.30ల నుంచి అర్ధరాత్రి వరకు కొనసాగుతుంది. భక్తులు దర్శించుకోవడానికి అనుగుణంగా ప్రత్యేక క్యూలైన్‌తో పాటు తాగునీరు, వైద్య సదుపాయాన్ని ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్లు షురూ

● తొలిరోజు పట్టభద్రుల స్థానానికి ఆరు నామినేషన్లు

● ఉపాధ్యాయ స్థానానికి మూడు నామినేషన్లు



నామినేషన్ పత్రాలను అందజేస్తున్న రఘోత్తం రెడ్డి

కరీంనగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. సోమవారం ఈ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ కాగానే పట్టభద్రుల స్థానానికి ఆరుగురు అభ్యర్థులు ఎనిమిది సెట్ల నామినేషన్లు, ఉపాధ్యాయుల స్థానానికి ముగ్గురు అభ్యర్థులు ఐదు నామినేషన్లు వేశారు. వీరిలో ఇద్దరు అభ్యర్థులు పట్టభద్రుల, ఉపాధ్యాయుల స్థానాలు రెండింటికి నామినేషన్ వేశారు. పట్టభద్రుల స్థానంలో సిలివేరి శ్రీకాంత్ (జమ్మికుంట), గవ్వల లక్ష్మి (దేవునిగూడెం), చాలిక చంద్రశేఖర్ (హైదరాబాద్), మంచికట్ల ఆశమ్మ (ఆదిలాబాద్), కంటె సాయన్న (మేడ్చల్), దూడ మహిపాల్ (ధర్మపురి) నామినేషన్లు వేశారు. ఉపాధ్యాయుల స్థానానికి సిలివేరి శ్రీకాంత్, చాలిక చంద్రశేఖర్, కూర రఘోత్తంరెడ్డి (గోనెపల్లి) నామినేషన్లు వేశారు. సిలివేరి శ్రీకాంత్, చాలిక చంద్రశేఖర్ అటు పట్టభద్రుల స్థానానికి, ఇటు ఉపాధ్యాయుల స్థానానికి నామినేషన్లను దాఖలు చేశారు. కరీంనగర్ కలెక్టర్, ఎమ్మెల్సీ ఎన్నికల అధికారి పమేలా సత్పతి ఈ నామినేషన్లను స్వీకరించారు.

● 10 వరకు నామినేషన్ల స్వీకరణ

ఎమ్మెల్సీ ఎన్నికల అధికారి పమేలా సత్పతి మాట్లాడుతూ ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలకు తాను రిటర్నింగ్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నానని, ఈనెల 10వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తామని తెలిపారు. 8,9 తేదీల్లో ప్రభుత్వ సెలవులు ఉండడంతో నామినేషన్ల స్వీకరణ ఉండదని, మిగతా పని దినాల్లో ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తామని ఆమె తెలిపారు. ఈనెల 11న నామినేషన్ల పరిశీలన, 13న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపట్టి పూర్తికాగానే ఫలితాలు ప్రకటిస్తామని చెప్పారు. నామినేషన్ల సందర్భంగా అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సందేహాలను నివృత్తి చేసేందుకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని వివరించారు. అభ్యర్థులు ఎన్నికల సందర్భంగా ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలని, ర్యాలీలు, సభలు, సమావేశాలకు ముందస్తు అనుమతి తీసుకోవాలని ఆమె సూచించారు.

పార్కులపై అధికారుల పట్టింపు కరువు

● ఎండిపోతున్న చెట్లు ● మందుబాబులకు అడ్డాగా మారిన పార్కు

జర దేఖో!!



మంచిప్పలో మండల పార్క్



పార్క్ వద్దనే మందుబాబుల అడ్డా

మోపాల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం లక్షలాది రూపాయల వ్యయంతో మండల ప్రాంతాల్లో పార్కులను ఏర్పాటు చేసిన విషయం అందరికి తెలిసిందే. ఈ పార్కులలో వేల మొక్కలను నాటారు. వాటిని ఎండిపోకుండా చూడాలని గ్రామస్థాయి అధికారులకు బాధ్యతలను అప్పగించిన విషయం అందరికి తెలిసిందే. పార్కులపై అధికారుల చూపు కరువవడంతో పార్కులో ఉన్న చెట్లన్నీ ఎండిపోయే పరిస్థితి వస్తున్నాయి. మండలంలోని మంచిప్ప గ్రామంలో మండల పార్కును సుమారు 6లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేశారు. ఈ పార్కులో సుమారు 5వేల మొక్కల వరకు నాటారు. మండల పార్కు అని బోర్డు కూడా ఏర్పాటు చేశారు. ఈ పార్కుపై అధికారుల పట్టింపు కరువవడంతో మందుబాబులకు అడ్డాగా మారింది. ఏర్పాటు చేసిన బోర్డును కూడా గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తు కుపోయారని గ్రామస్థులు తెలిపారు. చెట్ల నీడ ఎక్కువగా ఉండటంతో సమీపంలోనే ఉన్న బెల్ట్ షాపు నుండి మద్యాన్ని తెచ్చుకొని ఈ చెట్ల కింద నిత్యం తాగుతున్నా గ్రామ స్థాయి అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఈ పార్కులో ఏర్పాటు చేసిన మొక్కలు ఎండిపోతున్నాయి. అధికారులు ఎవరూ ఇక్కడి కి రావడం లేదని గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కులపై దృష్టి పెట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఎండిపోతున్న చెట్లను రక్షించు కోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని అధికారులు గ్రామస్థులకు సూచిస్తున్నారు. కాని పార్కులపై ఇటు అధికారుల దృష్టి కాని అటు గ్రామస్థుల దృష్టి లేకపోవడంతో ఈ పార్కు మందు బాబులకు అడ్డాగా మారడంతో గ్రామంలో చర్చ నీయాంశమైంది.

మద్నూర్‌లో దరఖాస్తుల వెల్లువ

● రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు కావాలంటూ అర్జీలు

మద్నూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఆశావహులు ఆర్జీలు పెట్టుకున్నారు. ఉమ్మడి మద్నూర్ మండలంలో ఆయా పథకాలకు గాను 4,584 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో రాణి వెల్లడించారు. ఇందులో భాగంగా మద్నూర్ మండలంలో రైతు భరోసా కోసం 59, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు 987, రేషన్ కార్డుల కోసం 2158, ఇందిరమ్మ ఇళ్ల కోసం 756 దరఖాస్తులు రాగా డోంగ్లి మండలంలో రైతు భరోసాకు 59, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం 232, రేషన్ కార్డుల కోసం 1351, ఇందిరమ్మ ఇళ్లకోసం 319 మంది దరఖాస్తులు చేసుకున్న ట్లు తెలిపారు. అన్ని దరఖాస్తులను పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు.

ఉమ్మడి మద్నూర్ మండలంలో సాగుకు యోగ్యత లేని 510 ఎకరాల భూమి గుర్తింపు



రైతు బంధు జాబితా నుంచి అధికారులు తొలగించిన గుట్ట ప్రాంతం

మద్నూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రైతు బంధుకు కాదేది అనర్హం అన్న చందంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గుట్టలు, పరిశ్రమలు, రియల్ ఎస్టేట్ వెంచ ర్లకు ఎకరాకు రూ.10 వేల చొప్పున ప్రజాధనాన్ని పుష్పం, బెల్లంను పంచారు. పట్టాదారు పాస్ పుస్తకం ఉంటే చాలన్న తీరుగా సాగుకు అవకాశం లేని భూములను చేర్చి రైతుబంధు కట్టబెట్టారు. సాగుకు యోగ్యత లేని భూములు గుర్తింపు కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇటీవల చేపట్టిన స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ అధికారులు ఉమ్మడి మద్నూర్ మండలంలో 510 రాళ్లను గుర్తించారు. ఉమ్మడి మద్నూర్ మండలంలోని తొమ్మిది క్లస్టర్ల పరిధిలోని 34 రెవెన్యూ గ్రామ పంచాయతీ లలోని గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి సాగుకు యోగ్యత లేని భవిష్యత్తులో అసలు సాగుకు అవకాశమే లేని భూములను గ్రామాల వారీగా గుర్తించి జాబితా తయారు చేశారు.

● జాబితాలో రాళ్లు గుట్ట, వెంచర్లు

వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయి పర్యటన సర్వేతో గుర్తించినర వాటిలో సుమారు 126 ఎకరాలలో ఇండ్ల స్థలాలు, 310 ఎకరాలలో రాళ్ల గుట్ట విస్తీర్ణం, 17 ఎకరాలలో ప్రభుత్వ భూములు, 57 ఎకరాల్లో లే అవుట్, రియల్ ఎస్టేట్ ఉన్నట్లు అధికారులు గుర్తించి వాటిని తొలగించారు. సాగుకు యోగ్యమైన భూమిగా రియల్ ఎస్టేట్ వ్యాపారు లు చేసిన ప్లాట్లు ఉండటం విస్తుపోయే విషయం నాలా (నాన్ అగ్రికల్చర్)కు మార్చకుండా వ్యవసాయ భూము ల్లోని చేసిన వెంచర్‌లోని ప్లాట్లు ఉన్నాయి. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చేందుకు నాలాకు వెళితే ప్రభుత్వానికి పన్ను చెల్లించాల్సి వస్తుందని దురాశతో నాలాగా మార్చుకోకుండానే వెంచర్లు చేసి గజాల చొప్పున రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ప్లాట్లను విక్రయించారు. దీంతో వ్యవసాయ భూములుగానే ఉన్న వీటన్నిటికీ ఇంత కాలం రైతు బంధు వర్తించింది.

'ఎంపీటీసీ' ఫైనల్ జాబితా ఖరారు

● ఎంపీడీవో కార్యాలయాల నోటీసు బోర్డులో అతికింపు



ఎంపీటీసీల స్థానాల జాబితాను అందిస్తున్న జూనియర్ అసిస్టెంట్

నిజాంసాగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా అధికార యంత్రాంగం స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఎంపీటీసీ స్థానాల జాబితాలను సోమవారం ఫైనల్‌గా ఖరారు చేశారు. ఈ మేరకు ఎంపీటీసీల జాబితా ఎంపీడీవో కార్యాలయ నోటీసు బోర్డులో అతికించారు. అధికార యంత్రాంగం ఎంపీటీసీ స్థానాలను 2576 జనాభాను మొదలుకొని ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేశారు. మహమ్మద్ నగర్ మండలంలో ఐదు ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేసిన విషయం తెలిసింది. మహమ్మద్ నగర్ మండలంలో దూప్ సింగ్ తండా ఎంపీటీసీ స్థానంలో దూప్ సింగ్ తండా గిర్నితండా, మద్దూంపూర్. కోమలంచ ఎంపీటీసీ స్థానంలో కోమలంచ, గాలిపూర్ తుంకిపల్లి థింకిపల్లి ఎంపీటీసీ స్థానంలో తుంకిపల్లి గుణుకుల్ బూర్గుల్ మహమ్మద్ నగర్ ఎంపీటీసీ స్థానంలో మహమ్మద్ నగర్ నర్వ అసంపల్లి గ్రామాలు సింగీతం ఎంపీటీసీ స్థానంలో సంగీతం తెలుగాపూర్ గ్రామాలను కలుపుతూ మండలంలో ఐదు ఎంపీటీసీ స్థానాలను అధికార యంత్రాంగం ఖరారు చేశారు. నిజాంసాగర్ మండలం పరిధిలోని మల్లూరు వెలగనూరు అచ్చంపేట, బంజపల్లి, వడ్డేపల్లి గ్రామాలను ఎంపీటీసీ స్థానాలుగా ఎం పిక చేశారు. మల్లూరు ఎంపిటిసి స్థానంలో మల్లూరు, మల్లూరు తండా జక్కాపూర్, వెలగనూరు ఎంపిటిసి స్థానంలో వెలగనూరు బ్రాహ్మణపల్లి నర్సింగ్ రావు పల్లి మంగళూరు గ్రామపంచాయతీలను కలిపారు. అచ్చంపేట ఎంపీటిసి స్థానంలో అచ్చంపేట ఆరేపల్లి గ్రామ పంచాయతీలు విలీనం చేశారు. బంజపల్లి ఎంపీటీసీ స్థానంలో బంజపల్లి సుల్తాన్‌నగర్ గ్రామ పంచాయతీలను కలుపుతూ బంజపల్లి ఎంపీటీసీ స్థానాన్ని ఖరారు చేశారు.

జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక



ముప్కాల్‌లో క్రీడాకారులకు క్రీడా దుస్తులు అందజేసిన కొత్తపల్లి రవి

ముప్కాల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో జరిగే సీనియర్ పురుషుల ఇంటర్ డిస్ట్రిక్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు 12 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు అంజయ్య లింగయ్య పేర్కొన్నారు. సోమవారం ముప్కాల్ మండల కేంద్రంలో భూదేవి ఇండోర్ స్టేడియంలో క్రీడాకారులకు తనవంతు సహాయంగా కొత్తపల్లి రవి క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు రవికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అకాడమి సభ్యులు మునుగొండ అంజయ్య, పీడీ రాజ్‌కుమార్, నాయకుడు సంతోష్, సిద్దిరమేష్, నర్సయ్య, ఏలేటి గంగాధర్, గడ్డం నర్సారెడ్డి, ముస్కు నర్సయ్య, మోతె గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాదం ఆకుపై సరస్వతీ ప్రతిమ



మద్నూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మద్నూర్ జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో చిత్ర లేఖ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బాస బాల్‌కిషన్ సోమవారం వసంత పంచమి సరస్వతి మాత పుట్టిన రోజును పురస్కరించుకుని బాదం ఆకుపై సరస్వతీ అమ్మవారి ప్రతిమను గీసి వసంత పంచమి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులపై చదువుల తల్లి కృప ఉండాలని కోరారు. ప్రతిమను చూసిన వారు ఆర్ట్ ఉపాధ్యాయుడికి అభినందనలు తెలిపారు. గతంలోను పండ్లు, కూరగాయాలు, రకరకాల వాటితో బొమ్మలు గీయడం జరిగింది. ఈ ప్రతిమ పలువురిని ఆకట్టుకుంది.

ఆకాశం.. జలంలోనూ అరుణ వర్ణమే

ఫొటో న్యూస్



సాయంత్రం సమయంలో చెరువులో సూర్యుడి ప్రతిబింబం

పెద్దకొడప్‌గల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): దినమంతా జగానికి వెలుగునిచ్చిన సూరీడు ఇక తాను అలసిపోయి విశ్రమిస్తానంటూ సాయంత్రం కొండల చివరి నుంచి వెలుతూ అదే సమయంలో మండలంలోని ఓ చెరువులో తన ప్రతిబింబాన్ని ప్రదర్శించాడు. దీంతో ఆకాశంలో సూరీడు అరుణమే.. జలంలో కూడా అరుణమే అంటూ స్థానికులు ఈ దృశ్యాన్ని ఆసక్తిగా తిలకించారు. అంతేగాక తెల్లని మబ్బులు కూడా చెరువు నీటిలో ప్రతిబింబిస్తూ చూపరులను ఆకట్టుకున్నాయి.

CLASSIFIEDS

AJC ANDHRA JYOTHI CLASSIFIEDS

WANTED LADY TEACHERS

Energetic and Passionate Educators with Fluency in the English Language for a Reputed School. **Post:** EVS and English for Pre Primary and Primary. **Qualification:** Graduate (B.Ed/TTC) (Equivalent). School Vehicle Facility for Staff from NZB. Interviews Dt: 05,06/02/2025 (These Interviews are for this year and the next academic year) Sri Sai High School, Kanjar (Post.) Mopal-NZB, Beside of NZB) 9989448828

AJZ

CHANGE OF NAME

I, VENKAT REDDY CHINTHAKUNTA S/O. GANGARAM (OLD NAME) R/O.H.NO.2-68/1, MOHAMMADAPUR (V), BIBIPET (M), KAMAREDDY (DIST). I HAVE CHANGED MY NAME AS CHINTAKUNTA VENKATA RAMULU S/O. GANGARAM (NEW NAME). R/O. H.NO 2-68/2, MOHAMMADPUR (V), BIBIPET (M), KAMA REDDY (D)

AJZ

CHANGE OF NAME

I, CHINTHAKUNTA PENTAMMA W/O. VENKATREDDY CHINTHAKUNA (OLD NAME) R/O. H.NO.2-68/1, MOHAMMADAPUR(V), BIBIPET (M), KAMAREDDY (DIST), I HAVE CHANGED MY NAME AS CHINTAKUNTA PENTAMMA W/O.CHINTAKUNTA VENKATA RAMULU (NEW NAME). H.NO 2-68/2, MOHAMMADPUR (V), BIBIPET (M), KAMA REDDY (DIST)

AJZ

ప్రతి రోజు... క్లాసిఫైడ్స్

ప్రతి 4 లైన్లకు 190/- అదనపు లైన్‌కు రూ.45/- GST 5% Extra

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

-: సంప్రదించవల్సిన నెంబరు :-

నిజామాబాద్: 99484 06282, కామారెడ్డి : 9985411453



మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

'కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం'

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేశారని, ఢిల్లీ ఎన్నికల్లో భాగంగా బీజేపీకి అనుకులంగా ఈ బడ్జెట్ ప్రవేశపెట్టారని డీసీసీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం కామారెడ్డి జిల్లాకేంద్రంలోని ఇందిరాచౌక్ వద్ద ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ నుంచి జీఎస్‌టీ, ట్యాక్స్‌ల ద్వారా రూ.కోట్లు కేంద్రానికి వెళ్తున్నాయని, కానీ రాష్ట్రానికి నిధుల కేటాయింపులో మాత్రం కేంద్రం మొండి చేయి చూపిందని విమర్శించారు. తెలంగాణ నిధులు రాబట్టని బీజేపీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లాగ్రంథాలయ చైర్మన్‌మద్దిచంద్రకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్ తదితరులున్నారు.

భిక్కనూరు పోస్టుమాస్టర్ కామారెడ్డికి బదిలీ

భిక్కనూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): భిక్కనూరు బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ రాజేందర్‌రెడ్డి కామారెడ్డి జిల్లాకేంద్రానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పోస్ట్‌మాస్టర్‌ను సిబ్బంది సోమవారం ఘనంగా సన్మానించారు. అలాగే భిక్కనూరు పోస్టు ఆఫీస్‌కు హైదరాబాద్ నుంచి బదిలీపై వచ్చిన శివాజీనాయక్ కు సిబ్బంది స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల సిబ్బంది పాల్గొన్నారు.

మత్తడిపోచమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ

లింగంపేట, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఎంతో మహిమాన్వితమైన చారిత్రక ఆలయం మత్తడిపోచమ్మ ఆలయ పునర్నిర్మాణానికి సోమవారం ఆలయ కమిటీ సభ్యులు భూమిపూజ చేశారు. ఆలయం వరకూ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేయడంతో ఆ పనులు సైతం ప్రారంభించారు. ఆలయ నిర్మాణానికి మండలంలో రూ.30 లక్షల వరకు విరాళాలు సేకరించారు. రంగరి దశరథం రూ.1,11,111 విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అశోక్, గౌరవ అధ్యక్షుడు శంకర్‌గౌడ్, మారుతి, నారాగౌడ్, బర్ల చందు, మురళి, మంగళి నారాయణ కులసంఘాల పెద్దలతోపాటు భక్తులు హజరయ్యారు.

ప్రజావాణికి దరఖాస్తులు నిల్

పెద్దకొడప్‌గల్, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి దరఖాస్తులు రాలేదని తహసీల్దార్ హిమబిందు తెలిపారు. ప్రతీ సోమవారం ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించగా ప్రజల నుండి ఎలాంటి దరఖాస్తులు రాలేదని వెల్లడించారు.

ట్రాక్టర్‌ను సీజ్‌చేసిన పోలీసులు

రాజంపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లేతమామిడి తండా, నడిమితండా గ్రామాలల్లో సోమవారం ఉదయం ఎటువంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా పోలీసులు దాడులుచేసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై పుష్పరాజ్ మాట్లాడుతూ సోమవారం ఉదయం నడిమితండాకు చెందిన వ్యక్తిని, ఇసుకతో ఉన్న ట్రాక్టర్‌ని అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్‌లు సురేష్ చరణ్ పాల్గొన్నారు.

మద్యపాన నిషేధంపై గ్రామస్థుల తీర్మానం

దోమకొండ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతమాన్‌పల్లి గ్రామంలో మద్యపాన నిషేధంపై గ్రామస్థులు సోమవారం తీర్మానం చేశారు. ఎవరైన గ్రామంలో చాటుగా మద్యం విక్రయిస్తే వారికి జరిమానా విధించడం జరుగుతుందని గ్రామస్తులు ఏకగ్రీవంగా తీర్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్నారం, చించోల్లి గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్

బీర్కూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలంలోని అన్నారం, చించోల్లి గ్రామాలలో సోమవారం డ్రింకింగ్ వాటర్‌పై అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా అధికారులు గ్రామాలలో పర్యటించి వాటర్ ట్యాంకులను, కుళాయిలను పరిశీలించారు. తాగునీరు సక్రమంగా సరఫరా అవుతుందా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వెంటనే సమస్యను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీవో మహబూబ్, ఏఈఈ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చట్టాలను ఉల్లంఘిస్తే జైలుకే : సీఐ సంపత్ కుమార్

దోమకొండ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి):ప్రజలు చట్టాలను ఉల్లంఘిస్తే జైలు శిక్ష తప్పకుండా భరించాలని సీఐ సంపత్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని ముత్యంపేట గ్రామంలోని జీపీ ఆవరణలో పోలీసు గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామంలో గత మూడు రోజుల క్రితం పాఠశాల గోడ కూలిన సంఘటనలో పోలీసులు తమ పని తాము చేయడం జరుగుతుందని ఎవరైన చట్టాలను తమ చేతిలోకి తీసుకోవాలని ప్రయత్నిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించాలని, పండగలు ప్రశాంతగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై ఇన్‌చార్జ్ ఆంజనేయులు, ఏఎస్సై సుబ్రహ్మణ్యచారీ, జానీ భాషా, పీసీలు కిరణ్, చంద్రకాంత్, అలేఖ్య , గ్రామస్థులు పాల్గొన్నారు.

'నా వాటా భూమి ఇప్పించండి'

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, ఎలాంటి విచారణ చేయకుండానే తన వాటా భూమిని తన అక్కపేరుపై చేశారని బీబీపేట మండలం మందాపూర్ గ్రామానికి చెందిన గొర్రెపద్మ ఆరోపించారు. సోమవారం కామారెడ్డి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కామారెడ్డి మండలం లింగాపూర్ గ్రామంలో తనతండ్రి పడిగే నర్సయ్య పేరున సర్వేనంబర్ 314/3/1లో 0.34 గుంటల సర్వేనంబర్ 315/7బీలో 0.19గుంటల భూమి ఉందని, తన తల్లి పడిగే మనెవ్వ కూడా మృతిచెందడంతో భూమి తన అక్క లక్ష్మీపేరుపై చేయించుకుందని అన్నారు. తన తల్లి డెత్ సర్టిఫికేట్ తనకు తెలియకుండా ఇవ్వవద్దని కామారెడ్డి మున్సిపల్‌లో అబ్జెక్షన్ లేటర్ పెట్టినడెత్ సర్టిఫికేట్ అందించారన్నారు. తనకు తగిన న్యాయం చేయాలని వేడుకుంటున్నానని అన్నారు.

భగలాముఖి పీఠం క్యాలెండర్ ఆవిష్కరణ

లింగంపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో సోమవారం శ్రీ భగలాముఖి పీఠం క్యాలండర్‌ను ఉత్తర శబరిమల ఆలయ నిర్మాణ రూప శిల్పి రవిగౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగలాముఖి పిఠం సేవలను మండల ప్రజలకు అందజేస్తామని ఆయన తెలియజేశారు.

ఉచిత వైద్యశిబిరం

భిక్కనూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని కాచాపూర్ గ్రామంలో మల్లారెడ్డి నారాయణ ఆసుపత్రి ఆధ్వర్యంలో, సిద్ది రామేశ్వర్‌నగర్ గ్రామసమీపంలో ఉన్న గురుకుల పాఠశాలలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కాచాపూర్‌లో 154 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందించారు. గురుకుల పాఠశాలలో విద్యార్థులకు చికిత్సలు నిర్వహించి మందులను అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో వెంకటరమణ, పాఠశాల ప్రిన్సిపల్ రఘు,మాజీ ఎంపీపీలు గాల్‌రెడ్డి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులు మోడల్‌కోడ్ పాటించాలి

● కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

కామారెడ్డిటౌన్,ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎంఎల్‌సీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు మోడల్‌కోడ్ పాటించాలని కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్ అన్నారు. సోమవరాం కలెక్టరేట్‌లో వివిధ పార్టీల ప్రతినిధులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ పట్టభద్రుల,ఉపాధ్యాయ నియోజకవర్గం ఎన్నికల దృష్ట్యా ఎన్నికల ప్రవర్తన నియామవళి అమల్లోకి వచ్చిందని తెలిపారు. ఈ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందని ఈనెల 10లోగా నామినేషన్‌దాఖలు చేయవచ్చని తెలిపారు. ఫిబ్రవరి 27 న ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. మార్చి 3 న ఓట్ల లెక్కింపు ఉంటుందని అన్నారు.జిల్లాలో 54 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయగా 29 కేంద్రాలు పట్టభద్రులకు, 25 కేంద్రాలు ఉపాధ్యాయులకు,కామన్ పోలింగ్ కేంద్రాలు 13 ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఇప్పటివరకు 16417 పట్టభద్రుల నియోజకవర్గం, 2125 ఉపాధ్యాయ నియోజకవర్గంలో ఓటర్లుఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్,ఆర్‌డీఓ ప్రభాకర్,తహసీల్ధార్ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 80 ఫిర్యాదులు

కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణిలో 80 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్ తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వినతులు అందించగా వాటిని పరిశీలించాలని అధికారులకు సూచించారు. భూసమస్యలు, రెండు పడక గదుల ఇండ్లు మంజూరు, సదరం సర్టిఫికెట్ మంజూరు తదితర సమస్యలపై వినతులు వచ్చాయన్నారు. ఎన్నికల కమిషన్ ప్రకటించిన శాసనమండలి సభ్యుల ఎన్నికల నిర్వహణకు జిల్లాలోని అధికారులను నోడల్ అధికారులుగా నియమించడం జరిగిందని, ఆయా అధికారులు ఎన్నికల విధులు నిర్వహించాలని తెలిపారు. ఉద్యోగుల వివరాలను సమర్పించాలని తెలిపారు.

కామారెడ్డి సబ్‌జైలును పరిశీలించిన డీజీ



అధికారులతో మాట్లాడుతున్న డీజీ సౌమ్యమిశ్రా

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి సబ్‌జైలును ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ట్ డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రా, డీఐజీ సంపత్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా జైలులో ఖైదీల యోగక్షేమాలను భోజనవసతులు, న్యాయసేవ, ఆరోగ్య సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. జైలులో గార్డెనింగ్ నిర్వహణ పరిశుభ్రత బాగుందని అధికారులను అభినందించారు. పలురికార్డులను పరిశీలించి అధికారులతో పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎస్పీ సింధూశర్మ, ఏఎస్పీ చైతన్యరెడ్డి, సబ్‌జైలు సూపరిటెండెంట్ ఆనందరావు,సబ్‌జైలుపర్యవేక్షణ అధికారి సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వదేశీ మేళా పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, నాయకులు

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 03(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలో కరీంనగర్‌లో నిర్వహించే స్వదేశీ జాగరణ మంచ్ తెలంగాణ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి 16 వరకు జరిగే స్వదేశీ మేళా పోస్టర్లను ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వదేశీ మేళా నిర్వహించడం గొప్ప విషయమని మేళాలు స్వదేశి ఉత్పత్తులు స్వదేశి విధానాలు భారతీయ సంస్కృతి, స్వదేశీ పరిజ్ఞానం కళాసంస్కృతులు నిర్వహిస్తారని తెలిపారు. ఆరురోజుల పాటు జగే ఈ స్వదేశీ మేళాకు రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలు పెద్దఎత్తున హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు స్వదేశీ జాగరణ మంచి ఇందూరు విభాగ్ కో-కన్వీనర్ రాజాగౌడ్, జిల్లా కన్వీనర్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మెగా యోగాశిబిరం



యోగాసనాలు చేస్తున్న స్వామిజీ

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 03 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కామారెడ్డి ఫ్రోబెల్స్ హైస్కూల్‌లో జరుగుతున్న మెగా శిబిరం విజయవంతంగా ముగిసింది. శిబిరానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ సైంటిస్టు డాక్టర్ పైడి ఎల్లారెడ్డి హాజరయ్యారు. పరమపూజ్యస్వామిజీ డాక్టర్ పరమార్థదేవ్‌జీ మాట్లాడుతూ ఆయుర్వేదం మన జీవన విధానం అని ప్రతిరోజు తులసి, కలబంధ, తిప్పతీగ లాంటి సేవిస్తే భవిష్యత్తులో మనకి వందేళ్ల వరకు ఏ రోగాలు దరిచేరవని వివరించారు. శ దాదాపు 1500మంది యోగసాధకులు ఈ శిబిరంలో పాల్గొన్నారు. యోగా శిబిరాన్ని నిర్వహించేందుకు కృషిచేసిన జిల్లా భారత్ స్వాభిమాన్ ప్రభారి యోగ రాంరెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో తెలంగాణ స్వాభిమాన్ ఉపప్రభారి శివకుమార్, రాజ్‌కుమార్,సురేందర్,ఎల్లయ్య,బానరఘుకుమార్, అంజయ్య, అనిల్ పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



బీజేపీ జిల్లా అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

బాన్సువాడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ కామారెడ్డి జిల్లా బీజేపీ పార్టీ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన నీలం చిన్న రాజులును సోమవారం కామారెడ్డి పట్టణంలోని ఆయన నివాసంలో బాన్సువాడ బీజేపీ పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానం చేశారు. సన్మానం చేసిన వారిలో శ్రీనివాస్ గార్గె, కోణాల గంగారెడ్డి, హన్మాండ్లు, పబ్బ శేఖర్, నాగేళ్ల సాయి కిరణ్, కొమ్ము ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు నెలల వేతనాలు చెల్లించాలి

● సబ్‌కలెక్టర్‌కు కార్మికుల వినతి



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

బాన్సువాడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తమకు రావాల్సిన నాలుగు నెలల బకాయి వేతనాలను చెల్లించేలా ఆదేశించాలని, విధుల నుంచి తొలగించిన ఇద్దరు మహిళా కార్మికులను పనిలోకి తీసుకోవాలని కోరుతూ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పేషంట్‌కేర్ కార్మికులు సోమవారం బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయికి సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబాస్‌రాములు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో అతలాకుతలమవుతున్న కార్మికులకు నెలల తరబడి జీతాలు రాకపోవడంతో కార్మికులు అనేక రకాలుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం బడ్జెట్ రిలీజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నల్ల గంగాధర్, కమ్మరి రాములు, హాస్పిటల్ కార్మికులు సంతోష్ గౌడ్, రేణుక, సురేఖ, తదితరులు పాల్గొన్నారు.

షాదీముబారక్‌లో జాప్యం లేకుండా చూడాలి

షాదీముబారక్ ఇవ్వడంపై మున్సిపల్, రెవెన్యూ అధికారులు నిబంధనల పేరిట జాప్యం చేస్తున్నారని, నిబంధనపేరుట జరుగుతున్న జాప్యంపై చర్యలు తీసుకోవాలని బాన్సువాడ పట్టణ మైనార్టీ నాయకులు సోమవారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయికి వినతిపత్రం అందజేశారు. అర్హులైనవారు షాదీముబారక్ కోసం దరఖాస్తు చేసుకోగా మున్సిపల్, రెవెన్యూ అధికారులు కులం, ఆదాయ ధ్రువ పత్రం పేరిట పొంతనలేని సమాధానాలు చెప్తూ జాప్యం చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు అక్బర్, రహీం, లాయక్, నిజాముద్దీన్, ఇర్ఫాన్ ఉన్నారు.

'ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో భవన నిర్మాణాలను ఆపండి'



షబ్బీర్‌అలీకి వినతిపత్రం అందజేస్తున్న మాజీ జడ్పీటీసీ

దోమకొండ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణ ప్రహరీ లోపల చేపడుతున్న భవన నిర్మాణాలను ఆపాలని మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ సోమవారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జడ్పీ సీఈవో చందర్ నాయక్, డీపీవో శ్రీనివాస్‌కి వినతిపత్రం అందజేశారు. గతంలో దోమకొండ సమితిగా ఉన్నప్పుడు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో స్వాతంత్ర సమరయోధుల శిలాఫలకం నిర్మాణం చేసినస్థలంలో దాన్ని తొలగించి అదేస్థానంలో దుకాణ సముదాయానికి రెండు దుకాణాలను నిర్మించడానికి ఎంపీడీవో (ప్రత్యేక అధికారి) ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. గతంలో రోడ్డు వెడల్పు కారణంగా శిలాఫలకం ఉండటంతో అక్కడి వరకు రోడ్డును తొలగించి రూట్ క్లియర్ చేయాల్సి వచ్చిందని, కామారెడ్డి, బీబీపేట వెళ్లే ముఖ్యమైన రహదారికి చౌరస్తా మీద నిర్మాణం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో చేయకుండా ఆపాలని కోరారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలి'



కళ్లకు గంతలు కట్టుకుని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న వికలాంగులు

నసురుల్లాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించి, ఎన్నికలు నిర్వహించాలని భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం సంఘం నేతలతో కలిసి కళ్లకు నల్లగంతులు కట్టుకొని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఏండ్ల తరబడి దివ్యాంగుల ఓట్లతో గద్దెనెక్కిన ప్రజాప్రతినిధులు చట్టసభల్లో వికలాంగుల సమస్యలపై చర్చించకుండా, వికలాంగుల సంక్షేమం గురించి పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లకావత్ మోహన్, సంఘం నసురుల్లాబాద్ నూతన మండల అధ్యక్షుడు ఓండ్ల భాస్కర్, మండల ఉపాధ్యక్షురాలు రాథోడ్ కవిత, బీర్కూర్ మండల అధ్యక్షులు ముఖీం, ఆలసింగ్ పాల్గొన్నారు.

కొందరికే భరోసా!

(5వ పేజీ తరువాయి)

రైతుకూలీలు నిరీక్షిస్తున్నారు. ప్రభుత్వం భూమిలేని నిరుపేదలకు ఏటా రూ.12 వేలు ఆర్థిక సాయాన్ని అందిస్తామని చెబుతుంది. ఇప్పటివరకు మండలానికో గ్రామంచొప్పున ఎంపికచేసిన గ్రామాలలోని లబ్దిదారులను గుర్తించి వారి ఖాతాలో జమచేశారు.జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు సుమారు 60 వేల కుటుంబాలు అర్హులుగా గుర్తించారు.ఇందులో ఈనెల 26న ఈ పథకం ప్రారంభించిన తర్వాత 22 గ్రామాలకు చెందిన 273 మంది ఖాతాలో రూ.16.36 లక్షలు జమచేశారని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ఈ సంఖ్య వందలకే పరిమితమైంది. ఆత్మీయ భరోసా కింద సాయం పొందేందుకు ఉపాధిహామీ పథకంలో పనిచేయాలన్న నిబంధన పెట్టడంతో చాలామంది నిరుపేదలు ఈ పథకానికి దూరమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ నిబంధన సడలించి భూమిలేని రైతు కూలీలకు అందివ్వాలని కోరుతున్నారు.

ఎన్‌హెచ్‌ఏఐ బస్టాపులు పేరుకే!

(5వ పేజీ తరువాయి)

నిలుపకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ రహదారి వెంట ఇరువైపులా దాబా హోటళ్లు ఉండడంతో భారీ వాహనదారులు కుమ్మక్కై బస్టాండ్‌ల వద్ద లారీలను పార్కింగ్ చేస్తున్న పోలీసులు అధికార యంత్రాంగం తమకు ఏమీ పట్టనట్లుగా ఉండడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారి సంగారెడ్డి కామారెడ్డి మెదక్ జిల్లాల సరిహద్దుల్లో నాందేడ్ సంగారెడ్డి అకోలా రహదారి కావడంతో చూసీచూడనట్లుగా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈదారి వెంట ఉన్న కల్హేరు, పిట్లం, పెద్ద కొడంగల్, జుక్కల్ బిచ్కుంద, మద్నూర్, నిజాంసాగర్ మండల పరిధిలో ఉన్న రహదారులపై దాబా యజమానులు పోలీసులకు ప్రతీనెల ముడుపులు ఇస్తున్నట్లు సమాచారం. సర్వీస్ రోడ్ లేకుండా మరుగుదొడ్ల వద్ద భారీ వాహనదారులు దర్జాగా నిలిపి దాబా హోటల్లో జల్సాలు చేసి వెళుతున్నట్లు తెలుస్తోంది. ఈ రహదారి వెంట ఉన్న కామారెడ్డి సంగారెడ్డి మెదక్ పోలీసులు నోరు మెదకపోవడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్‌హెచ్‌ఏఐ అధికార యంత్రాంగంతోపాటు పోలీసులు చర్యలు చేపట్టిన అవసరం ఎంతైనా ఉంది.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నీలం చిన్నరాజులు నియామకం

(5వ పేజీ తరువాయి)

చిన్నరాజులు తెలిపారు. తనకు జిల్లా అధ్యక్ష పదవి రావడం ఆనందంగా ఉందనితెలిపారు. జిల్లా అధ్యక్షునిగా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి,మరో కేంద్రమంత్రి బండిసంజయ్,ఎంపీ ఈటెల రాజేందర్,కామారెడ్డి ఎన్నికలఅధికారి ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, యెండల లక్ష్మీనారాయణ, మురళిధర్‌గౌడ్,మాజీ జిల్లా అధ్యక్షులు అరుణతార,బాణాలలక్ష్మారెడ్డిలకు ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. పార్టీని జిల్లాలో మరింత విస్తృతం చేసి ప్రతి కార్యకర్త అండగా నిలుస్తానని తెలిపారు.



మేనూర్‌లో పడిపూజలో పాల్గొన్న శివ స్వాములు

మార్మోగిన శివనామస్మరణ

మద్నూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేనూర్‌లో శివ నామస్మరణ మార్మోగింది. బాన్సువాడ, బిచ్కుంద, మద్నూర్ మండలాలకు చెందిన శివస్వాములు శివ నామస్మరణలో పాల్గొని పడిపూజ నిర్వహించారు. బిచ్కుంద మండలం ఖథ్‌గావ్ మహారాజ్ పడిపూజలో పాల్గొని శివస్వాముల చేత పూజలు నిర్వహించారు. 41రోజుల పాటు పూజలు నిర్వహించిన స్వాములు శివరాత్రి నాటికి శ్రీశైలానికి చేరుకుని శివ దీక్షను విరమింపజేస్తారని స్వామిజీ తెలిపారు. చెడు అలవాట్లకు బానిస కాకుండా ధర్మం కోసం పని చేయాలని స్వామిజీ భక్తులకు సూచించారు.

'వేల గొంతులు, లక్ష డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి'

నసురుల్లాబాద్, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో సోమవారం ఏబీసీడీ వర్గీకరణ కోసం ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అంబేద్కర్ సంఘ సభ్యులు అన్నారు. అనంతరం బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మెక్కా సాయి మాదిగ, టేకుల సాయిలు, నసురుల్లాబాద్ మండల కన్వీనర్, ఎంఎస్ఎఫ్ సీనియర్ నాయకులు మపురం శ్రీకాంత్, హనుమాన్లు, మైసయ్య, టేకుల సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని గోపాల్‌పేట్‌లో వసంత పంచమి పర్వదినం సందర్భంగా సోమవారం స్థానిక అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేద పండితులు దిగంబర్ శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చరణల మధ్య ఆలయ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. మండల కేంద్రంలో అయ్యప్పస్వామి ఆలయం లేనందున స్థానిక అయ్యప్ప స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి నూతన ఆలయాన్ని నిర్మించనున్నారు. ఈ ఆలయ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సంపత్ గౌడ్, స్థానిక మాజీ జడ్పీటిసి మనోహర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు రాంచంద్రారెడ్డి, వాసురెడ్డి, గురుస్వాములు వీరేందర్‌గౌడ్, వంశీకృష్ణగౌడ్, అయ్యప్ప సేవాసమితి సభ్యులు ప్రజలు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మార్కండేయ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన

లింగంపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండల కేంద్రంలోని వెంకట ఖాజా గుట్టపై పద్మశాలిల ఆరాధ్య దైవం మార్కండేయ మహారాజ్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి నుంచి కళశాలన్ని తీసుకుని ఆయలం వదరకు భారి శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సంతోష్, మారుతి, గంగాధర్, కాముని శ్రీనులతో పాటు పద్మశాలీలు ఉన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

థియేటర్	సినిమా
శాంతి	సంక్రాంతికి వస్తున్నాం
దర్శన్	పుష్ప-2
ప్రియా 70	డాకు మహారాజ్
ప్రియా 35	మదగదరాజ

బాన్సువాడ

థియేటర్	సినిమా
మహేశ్వరి	సంక్రాంతికి వస్తున్నాం
వెంకటేశ్వర	డాకు మహారాజ్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	140	180	210
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

